

విధ్వంస రచన.. తీరని వేదన

- షాపులు, బడ్డీల తొలగింపుతో నడ్డి విరిచిన జీవీఎంసీ
- రోడ్డున పడ్డ చిరువ్యాపారులు
- భారం కానున్న కుటుంబ పోషణ
- ప్రత్యామ్నాయంపై దృష్టిసారించని అధికారులు

'ఆపరేషన్‌ లంగ్స్‌' పేరుతో జీవీఎంసీ చేపట్టిన ప్రధాన రహదారుల్లో షాపుల తొలగింపు నగరంలోని బడుగుల ముఖచిత్రాన్ని మార్చేసింది. దశాబ్దాలుగా ఈ షాపులపై ఆధారపడి జీవిస్తున్న వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కుటుంబ బతుకుదెరువుపై జీవీఎంసీ దెబ్బ కొట్టిందంటూ బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పుడు కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఏం కావాలంటూ ఆవేదన చెందుతున్నారు. గాజువాకలో ఎక్కడ చూసినా బాధితుల ఆవేదనలు, ఆర్తనాదాలే వినిపిస్తున్నాయి.

– గాజువాక

మూడు వేల మందికి పైగా వెండర్స్‌

జీవీఎంసీ గాజువాక జోన్‌ పరిధిలో 1720 మంది స్ట్రీట్‌ వెండర్లు ఉన్నట్లు అధికారిక అంచనా. అయితే, నమోదు కాకుండా మరో 1300 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జోన్‌లో మొత్తం మూడు వేలమందికి పైగా చిరువ్యాపారులు ఉన్నారు. వారిలో కొందరు సొంత షాపుల ద్వారా వ్యాపారాలు చేసుకుంటుండగా మరికొందరు పుట్‌పాత్‌లపై షాపులు పెట్టుకొని, మూవ్‌బుల్‌ కౌంటర్స్‌ పెట్టుకొని వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వారిలో 80 శాతం మందికిపైగా జీవీఎంసీకి పన్నులు చెల్లిస్తున్నవారే. దశాబ్దాలుగా వారి కుటుంబ పోషణకు బడ్డీలు, షాపులే జీవనాధారంగా ఉన్నాయి. జీవీఎంసీ గుర్తించిన వారు స్ట్రీట్‌ వెండర్‌ కార్డ్‌, ట్రేడ్‌ లైసెన్స్‌లు కలిగివున్నారు. గుర్తించని వారిలో కూడా ట్రేడ్‌ లైసెన్స్‌లు చెల్లిస్తున్న వారు ఉన్నారు. ఈ షాపులు, బడ్డీల తొలగింపునకు చర్యలు చేపట్టాల్సి వస్తే వారికి జీవీఎంసీ ముందుగా ప్రత్యామ్నాయం కల్పించాల్సి ఉంటుంది. ముందస్తు సమాచారం కింద వారికి కనీసం నోటీసులు జారీ చేయాల్సి ఉంది. ఈ దిశగా జీవీఎంసీ చర్యలు చేపట్టకపోవడం దుమారం రేపుతోంది. టౌన్‌ప్లానింగ్‌ విధ్వంసకర చర్యలతో ప్రస్తుతం వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

వేల దుకాణాల తొలగింపు



గాజువాక మెయిన్‌ రోడ్‌లో దుకాణం తొలగిస్తున్న జీవీఎంసీ అధికారులు

గాజువాక జోన్‌ పరిధిలో ఇప్పటి వరకు వేల సంఖ్యలో దుకాణాలు తొలగించారు. గాజువాక మెయిన్‌ రోడ్‌, కణితి రోడ్‌, బీసీ రోడ్‌, వడ్లపూడి మెయిన్‌ రోడ్‌, అగనంపూడి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో తొలగింపులు చేశారు. ఫుట్‌పాత్‌ వ్యాపారంపై ఆధారపడి వేల మంది జీవనం సాగిస్తుండగా, ఆయా షాపుల్లో పనిచేస్తున్న కొన్ని వేల మంది స్కిల్డ్‌ వర్కర్లు ఉపాధి పొందుతున్నారు. నగరంలో హాకర్స్‌ జోన్లు, వెండర్స్‌ జోన్లు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ ఉన్నప్పటికీ జీవీఎంసీ ఆ దిశగా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో వేలాదిగా పెరిగిపోతున్న కార్మికులు కుటుంబ జీవనం కోసం ఖాళీ ప్రదేశాల్లో షాపులు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉపాధి హామీ లభించకపోవడంతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొన్నవారు ఇప్పుడు జీవీఎంసీ చర్యలతో కుదేలైన పరిస్థితి నెలకొంది.

పొంతనలేని ప్రకటనలు

రోడు మార్జిన్‌లలో, ఫుట్‌పాత్‌లపైన దుకాణాల తొలగింపులో జీవీఎంసీ అధికారులు పొంతనలేని ప్రకటనలు చేస్తుండటం విస్మయానికి గురి చేస్తోంది. ఎవరి ప్రోద్బలంతో ఈ దుకాణాలను తొలగిస్తున్నారోనన్న విషయంలో బాధితులు ఒక నిర్ధారణకు రాకుండా ఉండడం కోసం గందరగోళ ప్రకటనలు చేస్తున్నట్టుగా భావిస్తున్నారు. కార్పొరేటర్‌ పీతల మూర్తి యాదవ్‌ కోర్టుకు వెళ్లి ఆర్డరు తేవడంతో ఈ దుకాణాలు తొలగిస్తున్నామని చెప్పిన అధికారులు ఆ తర్వాత మాట మార్చారు. దీనిపై గతంలోనే కౌన్సిల్‌ తీర్మానం చేసిందని, ఆ తీర్మానాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నామంటూ మరోసారి చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ మాటను కూడా మార్చారు. కౌన్సిల్‌ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడంతో దుకాణాలు తొలగిస్తున్నామని చెబుతున్నారు. అధికారులే ఈ విధంగా చెప్పడంపై ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాన్ని పట్టించుకోరా?

ఇదిలా ఉండగా, చిరు వ్యాపారుల కోసం కూడా ఒక చట్టం ఉంది. ఆ చట్టం ప్రకారం అధికారులు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉపాధి ఆశించకుండా స్వయం ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులపై పెత్తనం చేయరాదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పినట్టు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఆ తీర్పు మేరకు పార్లమెంట్‌లో చిరువ్యాపారుల పరిరక్షణ చట్టం వచ్చినట్టు చెబుతున్నారు. ఈ చట్టం ప్రకారం ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకొంటున్నవారికి ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించకూడదు. ఆ చట్టం మేరకు మెప్మా ఆధ్వర్యంలో 14 మంది అధికార యంత్రాగంతో కూడిన కమిటీలు కూడా వేశారు. గాజువాకలాంటి ప్రాంతంలో జోనల్‌ కమిషనర్‌ ఆ కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రెండు నెలలకిందట సర్వే కూడా చేశారు. జోన్‌ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ కమిటీల్లో తీర్మానం చేయకుండా ఇప్పుడు దుకాణాలను తొలగించడం వివాదాలకు తెరలేపింది.



తొలగించిన టీ దుకాణం

20 ఏళ్లుగా జ్యూస్‌ సెంటర్‌ నడుపుతున్నా



నేను 20 ఏళ్లుగా ఇక్కడ జ్యూస్‌ సెంటర్‌ నడుపుతున్నాను. నా కుటుంబం నడవడానికి ఇదొక్కటే ఆధారం. దీనిపై ఆధారపడి నేను, నా భార్య, ఇద్దరు పిల్లలు బతుకుతున్నాం. నాతోపాటు మరో ఇద్దరు వర్కర్లు పని చేస్తున్నారు. వారి కుటుంబాలకు కూడా ఇదే ఆధారం. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మా దుకాణాన్ని తొలగించారు. కనీసం సామాన్లు బయటకు తీసుకొనే అవకాశం కూడా ఇవ్వలేదు. నాకు జీవనాధారంగా నిలిచిన బతుకుదెరువును పడగొట్టొద్దని ఎంత బతిమలాడినా అధికారులు వినలేదు.

– రాంబాబు, చిరు వ్యాపారి.

రోడ్డున పడేశారు



పదేళ్లుగా ఇక్కడ టీకొట్టు నడుపుకొంటున్నాను. ఈ దుకాణమే మాకు జీవనాధారం. జీవీఎంసీ అధికారులు సడెన్‌గా వచ్చి మా దుకాణాన్ని పడగొట్టేశారు. టైం ఇవ్వండని అడిగినా పట్టించుకోలేదు. చాలా దుర్మార్గంగా నా కొట్టును తిరగేసేశారు. కనీసం షాపులోని సామాన్లు తీసుకొనే సమయం కూడా ఇవ్వలేదు. ఇలా చేయడం న్యాయం కాదు.

– వి.రవి, టీ దుకాణం నిర్వాహకుడు

ఎక్కడివారిని అక్కడే ఉంచాలి



జీవీఎంసీ అధికారులు చేస్తున్నది దుశ్చర్య. చట్టానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించకుండా దుకాణాలు తొలగించే అధికారం వారికి లేదు. వారికి స్థలం చూపించి జోన్స్‌ ఏర్పాటు చేయాలి. అంతవరకు ఎక్కడివారు అక్కడే ఉండే విధంగా సహకరించాలి.

– కసిరెడ్డి సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు, చిరువ్యాపారుల సంఘం

క్లుప్తంగా

నిత్యావసర సరకుల వితరణ



వృద్ధులకు సరకులు అందజేస్తున్న హరనాథ్‌

కూర్మన్నపాలెం: పెదమడక ప్రాంతంలోని ఇద్దరి వృద్ధులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులను బుధవారం సర్వహిత చారిటబుల్‌ ట్రస్ట్‌ ప్రతినిధులు అందించారు. 25 కిలోల చొప్పున బియ్యం, పప్పులు ఇతర నిత్యావసర దినుసులు ట్రస్ట్‌ చైర్మన్‌ పెదిరెడ్ల హరనాథ్‌ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ అందజేత



వీల్‌చైర్‌ అందజేస్తున్న దాతలు

అగనంపూడి: ఓ దివ్యాంగురాలికి దాతలు బుధవారం వీల్‌ చైర్‌ అందజేశారు. పెదమడకకు చెందిన అమరపిని లోవమ్మకు గుదే లక్ష్మణ్‌ ఆర్థిక సాయంతో వీల్‌ చైర్‌ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో విందుల చిరురాజు, గోవింద్‌, నారాయణ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ ఎస్‌ఐ శంకరరావు బాధ్యతల స్వీకరణ



సీఐ కేశవరావును కలిసిన ఎస్‌ఐ శంకరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐగా పి. శంకరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శంకరరావు ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతం, ఇంటెలిజెన్స్‌, ట్రాఫిక్‌, కోర్టు మానటరింగ్‌ విభాగాల్లో పని చేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్‌ సీఐ కేశవరావులను మర్యాదపూర్వకంగా కలిశారు.

బోనస్‌ చెల్లించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ కార్మికులకు బోనస్‌ వెంటనే చెల్లించాలని స్టీల్‌ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు యూనియన్‌ సెక్రటరీ జనరల్‌ రమణమూర్తి బుధవారం సీఎండీకి వినతిపత్రం అందజేశారు. గతేడాది స్టీల్‌ప్లాంట్‌ కార్మికులకు చెల్లించాల్సిన బోనస్‌ రూ. 26,500 చెల్లించలేదని వివరించారు. అయినా కార్మికులు చిత్తశుద్ధి పని చేసి ఉత్పత్తిని గణనీయంగా పెంచుతున్నారన్నారు. ఈ ఏడాది కార్మికులకు రూ. 29,500 బోనస్‌ చెల్లించాలని సెయిల్‌ యాజమాన్యం నిర్ణయించిందని.. అదే విధంగా ఇక్కడ కూడా రెండేళ్ల బోనస్‌ రూ. 56 వేలు దసరా ముందు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఆరోగ్య రక్షణలో ఫార్మాకోవిజిలెన్స్‌ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సంధ్యాదేవి

మహారాణిపేట: రోగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మాకోవిజిలెన్స్‌ కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రా మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.వి.ఎస్‌.ఎం.సంధ్యాదేవి అన్నారు. బుధవారం కాలేజీ సమావేశ మందిరంలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్‌ వారోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఫార్మకాలజీ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ డి.శ్యామల మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్‌ ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాధాకృష్ణ, డాక్టర్‌ వి.మన్మథరావు, డాక్టర్‌ ఎ.కృష్ణవేణి, ఫార్మకాలజీకి చెందిన డాక్టర్‌ డి.శ్యామల, ప్రొఫెసర్‌ డాక్టర్‌ కె.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణే... సదాపూర్ణే



అన్నపూర్ణాదేవిగా బర్మాకాలనీ దుర్గాదేవి



బాలచెరువులో అన్నపూర్ణ అలంకరణలో విజయదుర్గ



అన్నపూర్ణా దేవి అలంకరణలో దుర్గాలమ్మ

పెదగంట్యాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం దుర్గమ్మ అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలోని కనకదుర్గ అమ్మవారు, బాలచెరువులోని ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో అర్చకుడు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మార్మోగిన దుర్గమ్మ నామస్మరణ

అగనంపూడి: అగనంపూడి కూడలిలోని దుర్గాలమ్మను శరన్నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత అగనంపూడిలో వేంచేసియున్న బొర్రమాంబ ఇంటి నుంచి ఆలయం వరకూ మేళతాళాలు, కోలాట బృందాలతో సారె ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

త్రిశక్తి అమ్మవార్లకు విశేష పూజలు



అన్నపూర్ణాదేవిగా మహాదుర్గ



ధైర్యలక్ష్మిగా మహాలక్ష్మి



శారదాదేవిగా మహా సరస్వతి

ఉక్కునగరం: మహాదుర్గ,మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు వెలసిన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు బుధవారం మహాదుర్గ అమ్మవారు లేత పసుపు వర్ణంచీరలో అన్నపూర్ణాదేవిగా, మహాలక్ష్మి అమ్మవారు ఆకుపచ్చవర్ణం చీరలో ధైర్యలక్ష్మిగా, మహాసరస్వతి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో శారదాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు సహస్ర హస్త కంకణార్చన (గాజులతో అర్చన) చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం

జోన్‌ – 8 కార్యాలయం వద్ద వామపక్ష నాయకుల నిరసన

పెందుర్తి : పండగ వేళ చిరువ్యాపారుల జీవితాలను కూటమి ప్రభుత్వం చీకటిమయం చేసిందని వామపక్ష నాయకులు ఆరోపించారు. ఆపరేషన్‌ లంగ్స్‌ పేరిట నగరంలోని తోపుడుబళ్లు, బడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం కక్ష సాధింపునకు నిరసనగా బుధవారం వేపగుంటలోని జోనల్‌ కార్యాలయం వద్ద వామపక్షాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నేత వెంకటరెడ్డి, సీపీఐ నేతలు ఆర్‌.శ్రీనివాస్‌, వై.రాంబాబు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం చిరు వ్యాపారులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటి వరకు ఎక్కడెక్కడ వ్యాపారాలు చేసుకున్నారో వారికి అక్కడే అవకాశం కల్పించాలన్నారు. లేకపోతే కూటమి ప్రభుత్వంలోని కార్పొరేటర్ల ఇళ్ల ముట్టడితోపాటు భారీ ఉద్యమం చేపడతామన్నారు. చిరు వ్యాపారులకు హాకర్స్‌ జోన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

సిమెంట్‌ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ పాదయాత్ర



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక: అదానీ సిమెంట్‌ ఫ్యాక్టరీని పెదగంట్యాడ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దంటూ సీపీఎం నాయకులు బుధవారం గాజువాకలో పాదయాత్ర నిర్వహించారు. పాతగాజువాకలో ప్రారంభమైన పాదయాత్ర మెయిన్‌ రోడ్‌ మీదుగా కొత్తగాజువాక వరకు కొనసాగింది. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పుడు గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా అదానీ సిమెంట్‌ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని చూడడం దారుణమన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే పెదగంట్యాడ, గాజువాక, మల్కాపురం, ప్రాంతాలకు చెందిన పది లక్షలమంది ప్రజలు కాలుష్యం బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వల్ల గర్భస్రావాలు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వచ్చేనెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్‌, లక్ష్మి, సంతోష్‌, కిరీటం, రాము, అవతారం తదితరులు పాల్గొన్నారు.

24 గంటలూ వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఇంటక్‌ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్‌

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని స్టీల్‌ప్లాంట్‌ హెల్త్‌ సెంటర్‌ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఇంటక్‌ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు హెల్త్‌ సెంటర్‌ వద్ద ఐఎన్‌టీయూసీ నాయకులతో కలసి బుధవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్‌ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ హెల్త్‌ సెంటర్‌ పరిసర ప్రాంతాల కార్మికులకు ఎంతో ఉపయోగకరమని.. ఇప్పుడు హెల్త్‌ సెంటర్‌ 24 గంటల సేవలు నుంచి మినహాయించి సిబ్బందిని తగ్గించడం బాధాకరమన్నారు.కేవలం డాక్టర్‌, సిబ్బందితో జనరల్‌ షిఫ్ట్‌లో మాత్రమే సేవలందిస్తే..మిగతా రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగి అత్యవసర వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని 24 గంటలు తగిన సిబ్బందితో కార్మికులకు సేవలందిచాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పీవీ రమణమూర్తి, బీఎస్‌ రాజా, కొమ్ము ప్రసాద్‌, రమణ, పోలీసు నాయడు,మంత్రి గోపీనారాయణ, కోరిబిల్లి అప్పారావు, ఎల్లాజీరావు, పూతి పోతయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎంయూ రిలే నిరాహారదీక్షలు



కూర్మన్నపాలెం డిపో కోసం దీక్ష చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్‌ సిటీ డిపోను కొనసాగించాలన్న డిమాండ్‌తో ఎన్‌ఎంయూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 27వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కోసం 1992 లో నామమాత్రం లీజుపై 8 ఎకరాల స్థలం ఇవ్వడం జరిగిందన్నారు. లీజు పూర్తి కావడంతో రూ.130 కోట్లు చెల్లించాలని.. లేనిపక్షంలో ఖాళీ చేయాలని ఉక్కుయాజమాన్యం చెప్పడం అన్యాయమన్నారు. ప్రజల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డిపోను అక్కడే కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. కార్మిక నాయకులు బి. సత్యనారాయణ, ఎస్‌. బాబ్జీ, ఈ. నరసింహారావు, ఉరుకూటి రాము నాయుడు, ఎన్‌ఎంయూ నాయకులు పి. సాయిరామ్‌, పి. శంకరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు వెండి ఊయల బహూకరణ



వాసవీ మాతకు ఊయల బహూకరిస్తున్న దాతలు

గాజువాక: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గాజువాక ఆర్యవైశ్య సంఘం నాయకులు కేసారపు శ్రీను రమేష్‌, లక్ష్మీ దంపతులు వెండి ఊయలను బహూకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ కమిటీ ప్రతినిధులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తాళ్లూరు మల్లేశ్వరరావు, కులుకూరి మంగరాజు, కేసారపు సతీష్‌, కోట అనంత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ,యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

అల్లిపురం: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ శంఖబ్రత బాగ్చి అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ ధనశక్తి దుర్గాదేవి ఆలయ పీఠాన్ని బుధవారం సాయంత్రం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకుడు రవి భవానీ ఆహ్వానం పలికారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈస్ట్‌ సబ్‌ డివిజన్‌ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి, టూటౌన్‌ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సీపీతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు.